క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

గంపలగూడెం: తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణ నిధి గురువారం గంపలగూడెంలో పర్యటిస్తారని ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన సిమెంట్‌రోడ్లు, తాగునీటి సరఫరా పనులను ఆయన ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మైలవరం: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘ జిల్లా నాయకులు గరికపాటి మహేష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 2005 నుంచి కంప్యూటర్ ఆపరేటర్స్ ఏడాదిలో కాంట్రాక్ట్ పద్ధతిలో మేజర్ పంచాయతీలలో నియమించి తదుపరి 2014లో అన్ని మైనర్ గ్రామ పంచాయతీలలో నియమించారని పేర్కొన్నారు.

వాసవీమాత ఆలయానికి రూ.5 లక్షల విరాళం

నూజివీడు: స్థానిక వాసవీ మాత అమ్మవారి ఆలయానికి మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య బుధవారం రూ.5 లక్షల విరాళం అందజేసినట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ గోపి, వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి విరాళం అందజేసిన రామకోటయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సోషల్ మీడియా వేదికగా వస్తున్న సమాచారం, అపరిచితులతో బాలికలు అప్రమత్తంగా ఉండాలని దిశ పోలీస్ స్టేషన్ సీఐ వాసవి అన్నారు. కొండపల్లి డీపీవీ పాఠశాలలో బాలికల భద్రతపై బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఇతరులు ప్రవర్తించే తీరు, ఆకర్షిత విషయాలను బాలికలు గమనించాలన్నారు. ఫోన్‌లలో వచ్చే లింక్‌లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులతో స్నేహ బంధాలు పెంచుకోవద్దన్నారు. దిశ యాప్ తమ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకుని ఏ సమయాల్లో పోలీసులకు ఫిర్యాదు చేయాలో తెలియజేశారు.

మామిడి పరిశోధన స్థానం పరిశీలన



నూజివీడు: స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థినులు బుధవారం స్థానిక మామిడి పరిశోధన స్థానాన్ని సందర్శించారు. ల్యాబ్, శాస్త్రవేత్తల విధులు, నర్సరీ మొక్కల ప్రాముఖ్యత తదితర అంశాల గురించి ప్రధాన శాస్త్రవేత్త కె.రాధారాణి, కీటక శాస్త్రవేత్త జి.స్రవంతి విద్యార్థులకు వివరించారు. పరిశోధన స్థానం రైతులకు అందించే సేవలపై అవగాహన కల్పించారు. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన వంగడాల అభివృద్ధికి చేసే పరిశోధనలను వివరించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో ఆగిరిపల్లి విద్యార్థుల ప్రతిభ



నూజివీడు(ఆగిరిపల్లి): ఏలూరులోని అల్లూరి సీతా రామరాజు స్టేడియంలో నిర్వహించిన దివ్యాంగుల జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ఆగిరిపల్లి మండలానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 100 మీటర్ల రన్నింగ్‌లో గరిసేపల్లి లక్ష్మీ (ఏడో తరగతి) ప్రథమ, కొణతం జ్యోతి (8వ తరగతి) ద్వితీయ స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగంలో ఆవుల దినేష్‌కుమార్ (ఏడో తరగతి) ద్వితీయ స్థానం సాధించి ఉన్నతాధికారుల నుంచి పతకాలను అందుకున్నారు.

పాలసీదారుల ఆత్మబంధువు ఎల్ఐసీ ఏజెంట్

తిరువూరు: భారతీయ జీవిత బీమా సంస్థ ఏజెంట్లు పాలసీదారులకు ఆత్మబంధువుగా వ్యవహరించాలని ఎల్ఐసీ మచిలీపట్నం డివిజన్ ఎస్‌డీఎం గురివిందపల్లి సుధాకర్‌బాబు అన్నారు. స్థానిక ఎల్ఐసీ శాటిలైట్ బ్రాంచి కార్యాలయాన్ని బుధవారం సందర్శించిన ఆయన ఏజెంట్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పాలసీలు తీసుకున్నప్పటికంటే పాలసీదారులతో ఏజెంట్లు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, కేవలం బీమా పథకాలే కాకుండా పొదుపు గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటిలో జీవిత బీమా పాలసీ తీసుకునే విధంగా ఏజెంట్లు కృషిచేసి వారి కుటుంబ భద్రతకు భరోసా ఇవ్వాలన్నారు. బ్రాంచి పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఏజెంట్లను ఎస్‌డీఎం సుధాకర్ సత్కరించారు. తిరువూరు బ్రాంచి మేనేజరు ఎం.రమేష్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి నాగమణెమ్మ



కోకిలంపాడులో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగమణెమ్మ

తిరువూరు: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులు విధిగా ఈ-క్రాప్‌లో ఆ పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి నాగమణెమ్మ పేర్కొన్నారు. మండలంలోని కోకిలంపాడులో ఈ-క్రాప్ నమోదు విధానాన్ని బుధవారం తనిఖీ చేసిన ఆమె ఈ ప్రక్రియలో ప్రయోజనాలను రైతులకు వివరించారు. రైతులు తాము పండించిన పంటను విక్రయించేందుకు, ప్రభుత్వం నుంచి సబ్సిడీ పథకాల ప్రయోజనాలు పొందడానికి ఈ-క్రాప్ డేటా ప్రామాణికమని తెలిపారు. పంటల్లో సస్యరక్షణ చర్యలు, సాగునీటి యాజమాన్యం, వెదజల్లే పద్ధతిలో వరిసాగుపై రైతులకు సూచనలిచ్చారు. తిరువూరు ఏడీఏ జే కెనడీ, ఏఓ పద్మ, టీఏఓ స్వప్న, ఉద్యానవన సిబ్బంది పాల్గొన్నారు.

వరి, పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): వరి, పత్తి పైరుల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి బి.సత్యవతి అన్నారు. కేతనకొండలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడిలో ఆమె పాల్గొన్నారు. వరి, పత్తి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కాండం తొలుచు పురుగు, రెక్కల పురుగులు విస్తృతంగా ఉన్నట్లు గుర్తించారు. చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు రైతులకు వివరించారు. ముందుగా ఫెరమోన్‌ట్రాప్స్‌తో రెక్కల పురుగులు నివారించి,



కేతనకొండలో వరిపైరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

తీవ్రత స్థాయిని బట్టి రసాయన ఎరువులు వాడాలన్నారు. ఎరుపురంగులోకి మారి గిడసబారిన పత్తి మొక్కలకు 13-0-45తో పాటు మెగ్నీషియం, సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఏఓ డి.శైలజ పాల్గొన్నారు.

ఎ.కొండూరులో..

ఏ.కొండూరు: ఈ-క్రాప్ పంట నమోదు సక్రమంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి సాకా నాగమణెమ్మ పేర్కొన్నారు. మండలంలోని పోలిశెట్టిపాడులోజరుగుతున్న ఈ-క్రాప్ పంట నమోదు కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మండలంలో నేటి వరకు 85శాతం ఈ-క్రాప్ పంట నమోదు చేశారన్నారు. పత్తి, మిరప, వరి, పామాయిల్, మామిడి, అపరాల పంటలను రైతులు ఈ-క్రాప్ పంట నమోదు చేశారన్నారు. మిగిలి ఉన్న పంటలకు ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూరి చేయాలని ఆదేశించారు. కార్యక్రమం ఏడీఏ జి. కెనడీ, టెక్నికల్ వ్యవసాయాధికారి స్వప్న, ఏఓ టిప్పు సుల్తాన్, ఏఈఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

డ్రెయినేజీలలో పూడికతీత పనులు



ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ బాలకృష్ణ



చాట్రాయి డ్రెయిన్‌లో పూడిక తీస్తున్న సిబ్బంది

తిరువూరు: పట్టణంలో మురుగునీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న పలు డ్రెయినేజీలలో పూడికను బుధవారం నగర పంచాయతీ ప్రత్యేక పారిశుద్ధ్యం కార్యక్రమం నిర్వహించి తొలగించింది. పలు వార్డుల్లో అంతర్గత రహదారులకు అనుబంధంగా ఉన్న మురుగుకాల్వలు ఆక్రమణకు గురవడంతో పాటు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో నీరు రోడ్లపై పారుతోందని పలువురు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. కమిషనర్ బాలకృష్ణ పర్యవేక్షణలో పారిశుద్ధ్యం సిబ్బంది ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

చాట్రాయిలో పారిశుద్ధ్య పనులు

చాట్రాయి: గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రెయిన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు.

వేంకటాచలస్వామి ఆలయంలో సహస్రదీపాలంకరణ



తిరువూరు: తిరువూరులోని శ్రీవేంకటాచల స్వామి ఆలయంలో బుధవారం సహస్రదీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వామికి విశేషార్చనల అనంతరం వైష్ణవ గోష్ఠి సభ్యులు సహస్రదీపాలంకరణ జరిపారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు పర్యవేక్షించారు.

ఘనంగా గణపతి నిమజ్జనం



మైలవరం కోట వెనుక కూరగాయలతో అలంకరించిన గణనాథుడు



వినాయకుడికి పూజ చేయిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న దేశిరెడ్డి

గణపతి సేవలో ఎమ్మెల్యే ప్రతాప్

నూజివీడు: గణపతి నవరాత్రుల్లో భాగంగా స్థానిక మైలవరం రోడ్డులో వినాయకుడి నవరాత్రుల్లో భాగంగా గణపతిని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం దర్శించుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ ప్రారంభించారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, మురళీ యూత్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం తిరువూరు పట్టణంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. రాజుపేట, అశోక్‌నగర్, పాతతిరువూరు, శాంతినగర్, బైపాస్‌రోడ్డులలోని వినాయక విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి కట్టలేరులో నిమజ్జనం గావించారు.

చాట్రాయి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వినాయక నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నర్సింహరావుపాలెం మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద రెండు వేల మందికి ఏర్పాటుచేసిన అన్నసమారాధనను ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గుడిపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అల్లు సత్యనారాయణరెడ్డి రూ.50,116 అందజేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి పాల్గొన్నారు. సూరంపాలెం యాదవ కాలనీలో వినాయక విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు.

80 కిలోల కూరగాయలతో అలంకారం

మైలవరం: వినాయక చవితి సందర్భంగా మైలవరం కోట వెనుక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథునికి 80 కిలోలు కూరగాయలతో బుధవారం అలంకరించారు. పదో రోజున గణపతిని 30 కిలోలు వంకాయలు, 30 కిలోలు బెండకాయలు, కేరట్-10 కిలోలు కాకరకాయ, 10 కిలోలు దోసకాయలు, సొరకాయలు, బంగాళాదుంప, పొట్లకాయలు, నిమ్మకాయలు, చిక్కుళ్లతో అలంకరించారు.

కేతనకొండలో..

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరునికి బుధవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి మహేంద్రనాథ్, ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: మండలంలోని కూనపరాజుపర్వ గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన వినాయక పూజ వేడుకల్లో బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే రెడ్డిగూడెంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని రాజగోపాలస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడిని ఊరేగించి నిమజ్జనం చేశారు. తోటకూర రవిబాబు, సర్పంచ్ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ బాబురావు పాల్గొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: గణపతి బప్పా మోరియా అంటూ భక్తులు వినాయకుని నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గంపలగూడెం గాంధీ సెంటర్, రెడ్డి బజారు, విశ్వ బ్రహ్మణ బజారు, సీటీకేబుల్ కార్యాలయం, పడమట దళితవాడ, కుమ్మర బజారు, ఎస్సీ, బీసీ కాలనీలలో విఘ్నేశ్వరుని ప్రతిమలకు 10 రోజులుగా విశేష పూజలు చేశారు. ఆయా ప్రతిమలను ప్రత్యేకంగా ఆలంకరించిన వాహనాలపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. అనంతరం నల్లచెరువు వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.



గంపలగూడెం గాంధీ సెంటర్లో వినాయక విగ్రహం ఊరేగింపు



మిట్టగూడెంలో వినాయకుడి లడ్డూను దక్కించుకున్న భక్తుడు

రూ.2,07,999 పలికిన వినాయక లడ్డూ

నూజివీడు: గణపతి నవరాత్రుల్లో భాగంగా నూజివీడు మండలం మిట్టగూడెంలో వినాయకుడి మండపం వద్ద ఉంచిన లడ్డూ ప్రసాదాన్ని బుధవారం నిర్వహించిన వేలం పాటలో మట్టా సీతారామరాజు అనే భక్తుడు రూ.2,07,999కు దక్కించుకున్నారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి బుధవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. విచిత్ర వేషధారణాలతో రంగు రంగు విద్యుత్‌దీపాలంకరణాలతో మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

ఎమ్మెల్యే ప్రతాప్ కృషితోనే కేంద్రీయ విద్యాలయం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నూజివీడు(ఆగిరిపల్లి): ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషి ఫలితంగానే నూజివీడుకు కేంద్రీయ విద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని ఆగిరిపల్లి మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. ఆగిరిపల్లిలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, మండల అధ్యక్షుడు పలగాని నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షురాలు తులిమెల్లి పావనజ్యోతి సుజనకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు బుధవారం మాట్లాడుతూ రెండేళ్లుగా ఎమ్మెల్యే ప్రతాప్ కేంద్రీయ విద్యాలయం మంజూరుకు తీవ్ర ప్రయత్నాలు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి గురుకుల విద్యాలయానికి ఏడెకరాల స్థలాన్ని కేటాయించేలా కృషి చేశారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రతాప్ అప్పారావు వల్లే సాధ్యమవుతుందని, వలస నాయకులు వచ్చి ఇక్కడ చేసేదేమీ ఉండదని అన్నారు. 2008లో ట్రిపుల్‌ఐటీని ఏర్పాటు చేసిన నాడే దానికి కావాల్సిన 100 ఎకరాలను రైతులతో మాట్లాడి ఉచితంగా అందించిన ఘనత ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుదేనని పేర్కొన్నారు. ప్రతాప్ అప్పారావును రాబోయే ఎన్నికల్లో తిరిగి గెలిపించుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు సద్దాం, గోపీ, నాయకులు గోళ్ల ఇస్సాకు, సక్కేశ్వరరావు, సుభాని పాల్గొన్నారు.

తలమానికంగా కేంద్రీయ విద్యాలయం

ముసునూరు: కేంద్రీయ విద్యాలయం నూజివీడుకే తలమానికంగా నిలుస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్ పేర్కొన్నారు. ముసునూరులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అధ్యక్షతన బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకటప్రతాప్ అప్పారావు కృషితో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుతో రాష్ట్రం నలుమూలలకు చెందిన విద్యార్థులకు అత్యున్నత సాంకేతిక విద్య అతి చేరువైందన్నారు. అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి లభించిందని నాయకులు వివరించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో నూజివీడు పట్టణం రాష్ట్రంలోనే అత్యంత ప్రాధాన్యం గల నగరంగా రూపు దిద్దుకుంటుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సత్యాలపాడు విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సత్యాలపాడు(గంపలగూడెం): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు గంపలగూడెం మండలం సత్యాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు వివిధ విభాగాల్లో ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.శేషంరాజు బుధవారం తెలిపారు. కృష్ణాజిల్లా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలో ప్రతిభకనబర్చిన వీరిని సాఫ్టుబాల్, బేస్‌బాల్ పోటీలకు అధికారులు ఎంపిక చేశారు. అండర్-17 విభాగంలో సాఫ్టుబాల్‌కు జి.గోపిక, బేస్‌బాల్‌కు శివ, గోపాలకృష్ణ, షేక్ జాన్‌బీ, అండర్-14 విభాగంలో సాఫ్టుబాల్‌కు ఎం.హారిక ఎంపికయ్యారు. బేస్‌బాల్ టీంలో ఎం.రితిక స్టాండుబైగా ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. వీరు అక్టోబర్‌లో గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరికి తగిన శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు జి. గోపాలరావు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎఫ్‌ఎం రేడియోను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ కృష్ణ

మైలవరం: విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానం కూడా పెంపొందించుకోవాలని రాజమండ్రి రీజినల్ జాయింట్ డైరెక్టర్ కమిషనరేట్ కాలేజియేట్ ఎడ్యుకేషన్(ఆర్‌జేడీసీఈ) ప్రొఫెసర్ సీ కృష్ణ తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎఫ్‌ఎం రేడియో స్టేషన్, కెరీర్ గైడెన్స్ సెల్‌ను బుధవారం ప్రొఫెసర్ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అన్ని వసతులూ సమకూర్చడం జరిగిందని, కార్పొరేట్ కళాశాలకు దీటుగా కళాశాల ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన కళాశాల ఎఫ్‌ఎం రేడియో విద్యార్థులకు వివిధ రకాల సమాచారాలను అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ వి.రాజు, సీనియర్ అసిస్టెంట్ సుధీర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలు చేయాలి



మైలవరం బార్ అసోసియేషన్ హాల్ వద్ద నిరసన ప్రదర్శనలో పాల్గొన్న న్యాయవాదులు

మైలవరం: న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలు చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్దవరపు వెంకట్రావు కోరారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు మైలవరం బార్ అసోసియేషన్ హాల్ వద్ద బుధవారం న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం న్యాయవాదులపై ఎక్కడో ఒక చోట దాడులు, అక్రమ కేసులు, హత్యా యత్నాలు వంటి సంఘటనల వలన న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. దేశ వ్యాప్తంగా న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఏఎల్ మైలవరం నాయకులు మాదు ఆంజనేయులు, జీ శ్రీనివాసరావు, ఎం.రవికుమార్, జూనియర్ న్యాయవాదులు శివదానం, శివకృష్ణ, ఎం.దివ్య, కీర్తి, న్యాయవాది గుమస్తాలు నవీన్, శీలం రామకృష్ణ పాల్గొన్నారు.

వరి పంటకు సరిపడా నీరు ఉండాలి



రైతు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ మోనీషా

మైలవరం: వరి పంటకు నీరు సరిపడా ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని విజయవాడ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మోనీషా తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో విజయవాడ జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో వరి, పత్తి, మొక్కజొన్న పంటల సమగ్ర యాజమాన్యంపై బుధవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడడతూ వరి చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు యూరియా, పొటాష్ వేసుకోవాలని, నీరు పంటకు సరిపడేలా ఉండాలనారు. పంటకు రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులు వాడాలని తెలిపారు. పట్టు పరిశ్రమ శాఖ అధికారి పీ శ్రీనివాస్ పట్టు పరిశ్రమ శాఖ ద్వారా అందించే రాయితీలు వివరించారు. రైతులు వారు వేసిన పంటను ఈ నెల 30వ తేదీలోగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి సంధ్యారాణి తెలిపారు.

సమాజ సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మైలవరం: సమాజ సేవే లయన్స్ క్లబ్ లక్ష్యమని, లైనిజమంటేనే సేవని, ఎన్నో సేవలు సమాజానికి మైలవరం లయన్స్ క్లబ్ అందిస్తుందని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ జేఎస్ శంకర్ గుప్తా తెలిపారు. మైలవరం ఎస్వీఎస్ కల్యాణ మండపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొల్లపూడి ఆంధ్ర హాస్పిటల్ సహకారంతో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం శంకర్‌గుప్తా మాట్లాడుతూ ఎక్కడ ఏ అవసరం వచ్చినా లయన్స్ క్లబ్ మెంబర్స్ ఉంటారని, దేశ, విదేశాల్లో లయన్స్ సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ద్వారకా తిరుమల వంశపారంపర్య ధర్మకర్త లయన్ ఎస్వీ ఎస్ నివృత రావు, సర్పంచ్ మంజుభార్గవి, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సెక్రటరీ గుప్తా హరీష్ కుమార్ పాల్గొన్నారు.

యువత సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలి

మైలవరం: నేటి యువత చదువుతో పాటు సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలని మదర్‌థెరీసా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ తెలిపారు. మైలవరం నూజివీడు రోడ్డులోని మదర్‌థెరీసా చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో వినాయక చవితి పండగ సందర్భంగా నిర్వహించిన వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు బుధవారం సేవా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కోయ సుధ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇంజినీరింగ్ విద్యార్థులు దేశాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలన్నారు. 20 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గూడూరు నాగిరెడ్డి, విద్యార్థి నాయకులు జీ. ఉమారామ్, యండూరి నేహా, ట్రస్ట్ కోశాధికారి డి. విజయలక్ష్మి పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ఎరువులు ఎక్కువ వాడొద్దు

విస్సన్నపేట: కాంప్లెక్స్ ఎరువులను ఎక్కువ మోతాదులో వాడటంతో భూమిలో భాస్వరం పేరుకుపోయి మొక్కలకు సూక్ష్మ పోషకాలు అందవని, అందువల్ల వాడొద్దని ఉద్యాన అధికారి బి.నరేంద్ర అన్నారు. మండలంలోని పుత్రేల, రామనగరం, జానలగడ్డ, వేమిరెడ్డిపల్లి గ్రామాల్లో 250 ఎకరాల్లో సాగు చేస్తున్న మిరపపంటను బుధవారం ఆయన పరిశీలించారు. మిరప పంటలో జెమిని వైరస్ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. రైతులకు తగు సూచనలు ఇచ్చారు.